క్లుప్తంగా

సంత్ రవిదాస్ జయంతి

చొప్పదండి: మండల కేంద్రంలో బుధవారం సంత్ రవిదాస్ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. స్వామివారి చిత్రపటానికి డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ధర్మ జాగరణ్ సమన్వయ కర్తలు కత్తెరపాక రాములు, వెల్మ బాపురెడ్డిలు విద్యార్థులకు రవిదాస్ జీవిత చరిత్రను తెలియజేశారు. కార్యక్రమంలో వడ్లూరి సుధాకర్, కల్లెపల్లి పరశురామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్‌కు చెందిన ఆర్టీసీ కండక్టర్ మొలు గూరి సాంబయ్య గుండెపోటుతో ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని బుధవారం ఎంపీపీ రాణి సురేందర్‌రెడ్డి పరామర్శించి ఐదు వేల ఆర్థికసాయం అందించారు. వెంట మాజీ ఎంపీటీసీ సదానందం తదితరులు ఉన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

హుజూరాబాద్: వాహనదారులు డ్రైవింగ్‌పై నిర్లక్ష్యం వహించొద్దని హుజూరాబాద్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సిటీ సెంట్రల్ ఫంక్షన్ హాల్‌లో వాహనదారులతో సమావేశం నిర్వహించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడుపొద్దన్నారు. అతివేగం, అజాగ్రత్త మూలంగా అనేక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, వాహనాలను నడిపే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు రమేష్, రామచందర్, సురేష్, ఎస్సై రాజన్న తదితరులు ఉన్నారు.

అగ్గి తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి

గంగాధర: వరిలో అగ్గి తెగులు నివారణకు తగిన చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రాజు రైతులకు సూచించారు. మండలంలోని కొండాయిపల్లి గ్రామంలో బుధవారం పంటపొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొలం గట్లను శుభ్రం చేసుకోవడం, యూరియా వాడకం నిలిపివేయాలని సూచించిన మందులు పిచికారీ చేయాలని రైతులక వివరించారు.

పశువైద్య శిబిరం

మానకొండూర్‌రూరల్: మండలంలోని ఊటూర్‌లో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచ్ సుదర్శన్ శిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలోని పశువులకు వివిధ రకాల చికిత్సలు, వ్యాధుల నివారణకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ పాలకేంద్రం ప్రెసిడెంట్ రాజేశం, లచ్చమ్మ, కుమార్, అరుణ్, రైతులు పాల్గొన్నారు.

స్వీయరక్షణపై అవగాహన

రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పరిధి కేజీబీవీలో బుధవారం బాలికలకు స్వీయ రక్షణపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా సఖీ కోఆర్డినేటర్ లక్ష్మి హాజరై మాట్లాడారు. బాలికలు ఆత్మరక్షణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మానవ అక్రమ రవాణా, సెల్‌ఫోన్ వినియోగం, నిర్భయ చట్టం, హెల్ప్‌లైన్ నంబర్, ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్ సుధారాణి, జయప్రద, కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత, అంగన్‌వాడీ టీచర్ పద్మ, టీచర్లు పాల్గొన్నారు.

అపోహలు వీడాలి

చొప్పదండి: పట్టణంలోని గృహ యజమానులు సకాలంలో ఆస్తిపన్ను చెల్లించాలని, పన్ను తగ్గుతుందనే అపోహలు వీడాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కొందరు ఎమ్మెల్యే రవిశంకర్‌ను కలిసి ఆస్తిపన్ను తగ్గించాలని కోరడంతో సిబ్బంది పన్నుల వసూల్ వెళ్తే పన్నులు తగ్గుతాయని ప్రశ్నిస్తున్నారని, 2022–23 ఆర్థిక సంవత్సరానికి పన్నులు సకాలంలో చెల్లించకపోతే 2 శాతం వడ్డీతో కలిపి చెల్లించాలన్నారు. పట్టణవాసులు ఆస్తిపన్ను తగ్గించాలని ఇచ్చిన దరఖాస్తు చైర్‌పర్సన్, కౌన్సిలర్ల పరిశీలనలో ఉందని, ఒకవేళ తగ్గినా వచ్చే ఆర్థిక సంవత్సరంలో తగ్గుతాయని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పన్నులు చెల్లించాల్సిందేనని సూచించారు. ఆస్తి, వాణిజ్య పన్నులు, ట్రేడ్ లైసెన్స్‌లు తప్పనిసరిగా చెల్లించాలని లేదంటే మున్సిపల్ చట్టం 2019 ప్రకారం ఆస్తులు జప్తు చేయడానికి తగు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తమ సిబ్బందికి ప్రస్తుత, బకాయిలకు చెందిన ఇంటి పన్నులు వెంటనే చెల్లించాలని, అపోహలు వీడాలని విజ్ఞప్తి చేశారు.

కుక్కల దాడిలో లేగదూడ మృతి

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం జేరిపోతుల ఎల్లయ్యకు చెందిన లేడదూడపై మంగళవారం రాత్రి కుక్కలు దాడి చేశాయి. దీంతో దూడమృతి చెందిందని ఎల్లయ్య, రైతులు తెలిపారు. ఇటీవల బదుగుల చొక్కాయ్య, గుడికందుల అనిల్‌కు చెందిన లేగదూడలు కుక్కలు దాడిలో మృత్యవాత పడ్డాయని, ప్రజలపై సైతం దాడి చేస్తున్నాయని, కుక్కల బెడదను అరికట్టాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

భూములు కోల్పోతున్నాం బాంచెన్

- కాల్వలు నిర్మించొద్దంటూ రైతుల నిరసన
- భూ సర్వేపై రైతుల్లో అనాసక్తి
- మాదాపూర్‌లో కాల్వల నిర్మాణంపై ఆందోళన


కుడికాల్వ వద్ద డీ-10 తూము


డీ-7 సర్వే నిలిపివేయాలని రైతుల వినతి

భూమి కోల్పోయాను



గతంలో హైదరబాద్‌కు తాగునీరందించేందుకు చేపట్టిన సుజల స్రవంతి పథకంలో చేపట్టిన పైప్‌లైన్ నిర్మాణంలో తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట భూమిని కోల్పోగా గన్నేరువరంలోని మాదాపూర్‌లో నాలుగు ఎకరాల భూమిని కొనుగోలు చేశాను. డీ–10 నిర్మాణంలో మళ్లీ మూడున్నర ఎకరాల భూమి కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఇప్పటికే ఉన్న కాల్వలతో సాగునీరు పుష్కలంగా అందుతోంది. డీ–10 కాలువ నిర్మాణం నిలిపివేయాలి.

– సునీల్‌రెడ్డి, మాదాపూర్

గన్నేరువరం: మిడ్‌మానేరు ప్రాజెక్టు కుడికాల్వకు అనుసంధానంగా చేపట్టే ఉపకాల్వల నిర్మాణాలపై రైతులు అనాసక్తితో ఉన్నారు. ఇప్పటికే నిర్మించిన ఉపకాల్వలతో సాగునీరు పుష్కలంగా అందుతోందని, మిగతా నిర్మాణాలు నిలిపివేయాలని కోరుతున్నారు. మండలంలో ప్రస్తుతం ఐదు ఉపకాల్వల ద్వారా పంటలకు సాగునీరందడంతో పాటు చెరువులు, కుంటలు నింపుతున్నారు. వీటితోనే భూ గర్భజలాలు పెరిగాయని, మళ్లీ ఉపకాల్వల నిర్మాణాలతో రైతులు భూములు కోల్పోతున్నారని నీటి పారుదలశాఖ అధికారులు, సిబ్బంది భూ సర్వే చేపడుతుండడంతో ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

మాదాపూర్‌లో వింత పరిస్థితి

మిగతా గ్రామాల్లో కాల్వ నిర్మాణాలు వద్దని రైతులు విన్నవిస్తుంటే, మాదాపూర్‌లోని ఉప కాల్వ 9కి అనుసంధానంగా 1ఎల్ కాల్వ(సబ్ మైనర్) నిర్మాణాన్ని చేపట్టాలని మాదాపూర్, హన్మజిపల్లె, మైలారం గ్రామాల రైతులు ఇటీవల మాదాపూర్‌లోని డి–9 కాల్వతో పాటు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ కాలువ ద్వారా మూడు గ్రామాలకు చెందిన 600 ఎకరాలకు సాగు నీరు అందనుందని, చెరువులు, కుంటల్లోని నీటిని తరలించవచ్చని చెబుతున్నారు. కేవలం ఒక్కరైతుతో ఈ కాల్వ నిర్మాణం నిలిపిపోయిందని, అధికారులు నిర్లక్ష్యంతో సాగునీరందక పంటల ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని ఆవేదన చెందుతున్నారు. చెరువులు, కుంటల్లో వేసిన చేపల పెంపకం ప్రశ్నార్థకంగా మారిందని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.


డీ-9 కాల్వ నిర్మించాలని రైతుల వినతి

ఇదీ పరిస్థితి..

రాజన్నా సిరిసిల్లా జిల్లా ఇల్లంతకుంట మండలం కొదురుపాక వద్ద నిర్మించిన మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వ నుంచి మండలంలోని 16వేల ఎకరాలకు సాగునీరందించేందుకు నీటి పారుదలశాఖ అధికారులు ఉపకాల్వల నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలో డి–6 ద్వారా పారువెల్ల, చొక్కారావుపల్లె, గన్నేరువరం, డి–8 ద్వారా ఖాసీంపేట, గన్నేరువరం, చాకలావానిపల్లె, మైలారం, మాదాపూర్, సాంబయ్యపల్లె, యాస్వాడ గ్రామాలకు. డి–9 ద్వారా మాదాపూర్, హన్మజిపల్లె, గోపాల్‌పూర్, మైలారం, తిమ్మాపూర్ మండలం జూగుండ్ల గ్రామాలకు, డి–12 పీచుపల్లి, జంగపల్లి, తిమ్మాపూర్ మండల రాంహనుమాన్‌నగర్, జూగుండ్ల గ్రామాలకు, డి–14 ద్వారా గునుకులకొండాపూర్, చీమలకుంటపల్లి, గుండ్లపల్లి, తిమ్మాపూర్ మండల వచ్చునూర్ గ్రామాలకు సాగు నీరు అందిస్తున్నారు. అలాగే చెరువులు, కుంటలు నింపుతున్నారు. 2019 నుంచి నిరంతరంగా సాగుతోంది.

మరో నాలుగు కాల్వలు

మిడ్ మానేరు ప్రాజెక్టు కుడి కాల్వ నిర్మాణ సమయంలో మొత్తం 9 ఉపకాల్వల నిర్మాణాలకు కుడికాల్వకు 9 తూములను అధికారులు ఏర్పాటుచేశారు. ఇందులో ఐదు పూర్తికాగా డి–7,10,11,13 నిర్మించేందుకు సర్వే చేస్తున్నారు. డి–7 ద్వారా బెజ్జంకి మండల వడ్లూరు, గన్నేరువరంలోని పారువెల్ల, ఖాసీంపేట గ్రామాల్లో 398 ఎకరాలకు, డి–10 ద్వారా మాదాపూర్, జంగపల్లి గ్రామాల్లో 140 ఎకరాలకు, డి–11తో పీచుపల్లిలోని 195 ఎకరాలకు, డి–13తో గునుకులకొండపూర్‌లో 286 ఎకరాలకు సాగునీరందించి చెరువులు, కుంటలు నింపేందుకు నిర్మాణాలు చేపట్టనున్నారు.

రైతుల నుంచి వ్యతిరేకత


డీ–7 నిర్మాణంలో 17 ఎకరాలు భూమి, డి–10లో 9 ఎకరాలు, డీ–11లో 8 ఎకరాలు, డీ–13లో 7 భూమిని రైతులు కోల్పోయే పరిస్థితి నెలకొంది. కానీ ఇప్పటికే చేపట్టిన ఉపకాల్వలతో మండలవ్యాప్తంగా సాగు భూములకు పుష్కలంగా నీరందుతోందని రైతులు అంటున్నారు. చెరువులు, కుంటల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో భూములన్నీ జాలువారి సాగుకు యోగ్యం కాకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నిలిపివేయాలని కోరుతూ పారువెల్ల, ఖాసీంపేట, వడ్లూరు, జంగపల్లి గ్రామాలకు చెందిన రైతులు తహసీల్దార్ బామ్‌సింగ్‌కు వినతిపత్రాలు సమర్పించారు.



ఉన్న కాల్వలు సరిపోతాయి

మిడ్ మానేరు ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా ఉపకాల్వలతో మండలంలోని పంటలకు సాగునీరు పుష్కలంగా అందుతోంది. భూగర్భజలాలు సైతం గణనీయంగా పెరిగాయి. మరిన్ని ఉపకాల్వల నిర్మాణాలకు అధికారులు భూసర్వే చేపట్టారు. దీనిని నిలిపివేయాలి.

– కృష్ణారెడ్డి, మాదాపూర్



అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

ఉపకాల్వల నిర్మాణాలకు నీటి పారుదలశాఖ అధికారులు చేపట్టిన భూ సర్వేను నిలిపివేయాలని రైతులు వినతి పత్రాలు అందించారు. సర్వే పూర్తి చేసి ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తాం. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– బామ్‌సింగ్, తహసీల్దార్ గన్నేరువరం

కమిటీలు

ఆర్‌ఎంపీ, పీఎంపీ నూతన కమిటీ

హుజూరాబాద్: పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో శ్రీ విఘ్నేశ్వర ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా సంగెం ఐలయ్య, అధ్యక్షుడిగా కందగట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ఎర్రోళ్ల సదానందం, కన్నబోయిన తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా చిలుకమారి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శిగా చిందం రామరాజు, కోశాధికారిగా చింద్యాల కమల్‌సింగ్, గౌరవ సలహాదారులుగా అడ్డగట్ల కృష్ణమూర్తి, ధనుంజయ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా శనిగరపు పరమేష్, కార్యవర్గ సభ్యులుగా గొల్లపల్లి రమణాచారి, మామిడి రమేష్, కుసుమ రాజు, కొలిపాక జగదీశ్, సబ్బని జగదీష్, అల్లి జగదీశ్ ఎన్నికయ్యారు.

శివాలయం నూతన కమిటీ

హుజూరాబాద్: పట్టణంలోని ప్రతాపవాడ శివాలయం నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రతాప రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ప్రతాప శ్రీనివాస్, డైరెక్టర్లుగా ప్రతాప రవీందర్, కృష్ణ, రమేష్, శ్రీనివాస్, శ్రీనివాస్, అనిల్, కొమురవెల్లి శ్రీనివాస్, అనమల సంజీవి, కాసర్ల శ్రీహరి, గొస్కుల రాజుకుమార్, ముద్దం జీవన్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను వార్డు కౌన్సిలర్ ప్రతాప తిరుమల్‌రెడ్డి ఘనంగా సన్మానించారు.

రైతు ఉత్పత్తిదారుల సంస్థను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి: మండల కేంద్రంలోని పీఏసీఎస్ సమావేశ మందిరంలో బుధవారం రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎంపీపీ చిలుక రవీందర్ హాజరై మాట్లాడారు. మండలానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు కావడం, మొక్కజొన్న పరిశ్రమ మంజూరైందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూస పద్ధతిలో వ్యవసాయం చేయకుండా ప్రత్యామ్నాయ వాణిజ్య పంటలు, తోటలు, కోళ్లు, ఆవులు, రొయ్యల పెంపకం ద్వారా ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో క్లాం తిరుపతిరెడ్డి, డైరెక్టర్ నాంపల్లి మల్లయ్య, సీఎస్‌ఏ యాదవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు పెంచాలని | కోటి సంతకాల సేకరణ

హుజూరాబాద్: రాష్ట్రంలో బీసీలకు 27 నుంచి 52 శాతానికి రిజర్వేషన్లు పెంచాలని కోరుతూ బుధవారం బీఎస్పీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ సమీపంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు

గంగాధర: బీసీ రిజర్వేషన్లు పెంచడం, బీసీ కుల గణన చేపట్టాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి నల్లాల రాజేందర్ డిమాండ్ చేశారు. కోటి సంతకాల సేకరణ కార్యక్రమం మండలంలోని ఉప్పరమల్యాల గ్రా మంలో నిర్వహించారు.

తిమ్మాపూర్: మండలం కేంద్రంలో బహుజన సమాజ్ పార్టీ తిమ్మాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బీసీ జనగణన చేయాలని, బీసీ రిజర్వేషన్లు పెంచాలని కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కరీంనగర్ జిల్లా ఇన్ చార్జి మాతంగి అశోక్ హాజరై మాట్లాడారు. అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నబీసీల బతుకులు మారాలంటే రిజర్వేషన్లు 27 నుంచి 52 శాతం పెంచినప్పుడే బాగుపడతారని అన్నారు.


హుజూరాబాద్: సంతకాల సేకరణలో నాయకులు

కంటివెలుగు శిబిరం ప్రారంభం


కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి కొత్తపల్లి 20వ వార్డులో రెండో విడుత కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ తక్కళ్ళపెల్లి రాజేశ్వర్‌రావు బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేదల ఆరోగ్యం కోసం కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో వైస్ చైర్మన్ దేశిని స్వప్న కోటి, కౌన్సిలర్ దేశినిరాధ సదానందం, బొద్దుల అరుణరవీందర్, ఎలగందుల స్వరూపశ్రీహరి, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు నోముల మహేందర్‌రావు, వైద్యులు మౌనిక, దివ్య, సూపర్‌వైజర్స్ సాంబయ్య, ఏఎన్‌ఎంలు వాణిశ్రీ,హైమవతి శ్యామల, ఆశ వర్కర్స్, సీఎల్‌ఆర్‌పీ, ఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటు చేయొద్దు


వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

శంకరపట్నం: మండల కేంద్రంలోని కేశవపట్నం బస్టాండ్ ఎదురుగా చాకలి ఐలమ్మ విగ్రహ పక్కన కీ.శే గాజుల శంకరయ్య విగ్రహ ఏర్పాటును విరమించుకోవాలని, నిర్మాణానికి అనుమతి ఇవ్వొద్దని కోరుతూ రజక సంఘం నాయకులు తహసీల్దార్, మండల పరిషత్ అధికారి, ఎస్సై, గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాడిచర్ల తిరుపతి, చాకలి ఐలమ్మ విగ్రహ ఏర్పాటు చైర్మన్ కల్లెపల్లి క్రాంతి కుమార్, యువజన సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు కాల్వ కిషన్, నాయకులు, కిరణ్, సంతోష్, శ్రీనివాస్, బుచ్చయ్య పాల్గొన్నారు.

క్రీడాకారుడికి సన్మానం


కిషన్‌ను సన్మానిస్తున్న నాయకులు

గన్నేరువరం: ఆర్చరీ పోటీల్లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన క్రీడాకారుడు కూన కిషన్‌ను బుధవారం కూనవానిపల్లెలో మండల వాసులు సన్మానించారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించారని, మేలో దక్షిణకొరియాలో జరిగే ఆసియా పసిఫిక్ మాస్టర్స్ ఆర్చరీల్లో దేశం తరపున పాల్గొనడం అభినందనీయమన్నారు. మండల కేంద్రంలో విద్యాభ్యాసం చేసి ఆర్టీసీలో మెకానిక్ ఉద్యోగం చేస్తూ పోటీల్లో రాణించడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్, నియోజకవర్గ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి, తిమ్మాపూర్ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వరాచారి, దళితా మోర్చా అధ్యక్షుడు బామండ్ల రాజు, రేగూరి సుగుణాకర్ పాల్గొన్నారు.

డీ-13 ఉపకాలువ నిర్మాణం నిలిపివేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

గన్నేరువరం: గునుకులకొండాపూర్ గ్రామంలో చేపట్టే డీ–13 ఉపకాలువ నిర్మాణం నిలిపివేయాలని కోరుతూ గ్రామ రైతులు బుధవారం తహసీల్దార్ బామ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఉపకాలువకు నీటి విడుదలతో పంటలకు పుష్కలంగా సాగునీరు అందుతోందని, భూగర్భజలాలు గణనీయంగా పెరగడంతో భూములు జాలువారి ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాల్వ నిర్మాణంతో రైతులకు ఎలాంటి ప్రయోజనం లేదని, అధికారులు నిర్మాణం విరమించుకోవాలని విన్నవించారు. ఈకార్యక్రమంలో చంద్రయ్య, రాజయ్య, రమేష్, రాజవీరు, శ్రీనివాస్, వీరేశం, నర్సయ్య, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

గుంత పూడ్చివేత


గుంతను పూడ్చి వేయించిన అధికారులు

సాక్షి స్పందన

ఇల్లందకుంట: మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం వద్ద జమ్మికుంట–మొగుళ్లపల్లి ప్రధాన రహదారి పక్కన కొన్ని నెలల క్రితం బాలవికాస పైపులైన్ కోసం గుంత తవ్వి వదిలేశారు. రాత్రిపూట వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని ఈ నెల 1న 'పొంచి ఉన్న ప్రమాదం' అనే ఫొటోస్టోరీ 'సాక్షి'లో ప్రచురితమైంది. సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చారు. దీంతో వాహనదారు లు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హిమ్మత్‌నగర్‌లో ట్రాన్స్‌కో డీఈ పర్యటన


రైతులతో మాట్లాడుతున్న డీఈ విజేందర్‌రెడ్డి

వీణవంక: మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో ట్రాన్స్‌కో డీఈ విజేందర్‌రెడ్డి బుధవారం పర్యటించారు. కరెంట్ సమస్యలపై బుధవారం 'రైతుల జాగారం' అనే కథనం 'సాక్షి'లో ప్రచురితమైంది. దీంతో డీఈ విజేందర్‌రెడ్డి సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో పలువురు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్రీఫేజ్ సరఫరా చేస్తున్నామని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఎక్కడా లేదని స్పష్టం చేశారు. బావుల్లో భూగర్భజలాలు తగ్గాయని, పగలు త్రీఫేజ్ సరఫరా సక్రమంగా జరుగుతుందన్నారు. వెంట ఏడీఈ రాజేందర్, ఏఈలు సత్యనారాయణరెడ్డి, త్రిమూర్తి, సిబ్బంది ఉన్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో


మొలంగూర్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరిలో ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారిపై బుధవారం బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పగటిపూట త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో కోతలు విధించడం అన్యాయమని, కోతలు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు దుడ్డేల లక్ష్మినారాయణ, ప్రధాన కార్యదర్శులు పోలోజు సంతోష్‌కుమార్, పైడిపెల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బోయిని వంశీకృష్ణ, నాయకులు తిరుపతి, ప్రశాంత్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శంకరపట్నం: విద్యుత్ కోతలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మొలంగూర్ స్టేజీ వద్ద రహదారిపై చింతలపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు కేశవేణి అశోక్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా అంటూ గొప్పలు చెప్పడమే తప్పా ఆచరణలో లేదని, విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యుత్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పల్లె శివరెడ్డి, రాజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కోమల్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, సంపతి, తిరుపతి, సురేశ్, రవి, మహేందర్‌రెడ్డి, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, సది, మల్లేశం, కుమార్ పాల్గొన్నారు.

ట్రంక్ పెట్టెలు అందజేత



రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామ పరిధిలోని ప్రశాంత్‌భవన్ విద్యార్థులకు మల్యాల మండలం బల్వంతాపూర్ గ్రామానికి చెందిన జోగు అనిల్ స్నేహితుల సహకారంతో రూ. 15 వేల విలువ గల ట్రంక్ పెట్టెలను సమకూర్చగా రామడుగు ఎస్సై కె. అంజయ్య విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో రమేష్, రాజు, అనిల్, కత్తిరాజు, అడెపు శ్రీనివాస్, మల్లేశం, గుంటుకు అంజనేయులు, ఎండీ బాబు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు



రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో బుధవారం బాలాజీ లయన్స్ క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, క్లబ్ చైర్మన్ రమేష్, సభ్యులు భాస్కర్, హెచ్‌ఎం రవీందర్, టీచర్లు స్వరూప, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి పథకాలు

గన్నేరువరం: రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తూ రైతు బాంధవుడిగా మారారని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి అన్నారు. బుధవారం మండలంలోని గుండ్లపల్లిలో మాట్లాడారు. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధికంగా నిధులు కేటాయించారని, సబ్బండ వర్గాలకు బడ్జెట్ కేటాయింపులో సముచిత స్థానం కల్పించారని, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో మానకొండూర్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రజలు, రైతులను నిరాశ పరిచిందన్నారు. సమావేశంలో మాజీ ఎంపీపీ మల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, నాయకులు రవి, నర్సయ్య, కిట్టు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

తిమ్మాపూర్: బాలికలు మహిళలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ స్కీమ్ కరీంనగర్ సంయుక్తంగా విద్యార్థినులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ చైల్డ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ అరవింద, శ్రీలత ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.

హాథ్‌సే హాథ్ జోడో యాత్ర

రామడుగు: మండల కేంద్రంలో బుధవారం కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు హాథ్ సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించారు.

వెన్కెపల్లికి గోదావరి జలాలు


పూజలు చేస్తున్న సర్పంచ్ గణేశ్, రైతులు

సైదాపూర్: మిడ్‌మానేర్ కుడి కాలువ ద్వారా సైదాపూర్ మండలంలోని వెన్కెపల్లికి గోదావరి జలాలు రావడంతో బుధవారం సర్పంచ్ కొండ గణేశ్, వార్డు సభ్యులు, రైతులు పూజలు చేశారు. గతంలో సాగునీరు లేక కరువుతో ఎడారిగా మారిన సైదాపూర్ మండలానికి కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మిడ్ మానేర్ వరద కాలువ ద్వారా మండలంలోని దుద్దెనపల్లి, పెరుకపల్లి మీదుగా వెన్కెపల్లికి సాగునీరు వచ్చింది.